జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com


# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com


ఆదివారం | 18-1-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 565 పేజీలు: 4 వెల : రూ.7

* రాత్రి వేళల్లో అక్రమంగా మిల్లులకు తరలిపోతున్న రేషన్ బియ్యం
* బెండిగేటు మీద నుంచి టెక్కలిపట్నం మీదుగా లారీల్లో రవాణా
* మిల్లర్లకు కాసులు కురిపిస్సున్న ఉచిత బియ్యం
* పౌర సరఫరాల శాఖ అధికారుల తీరుపై అనుమానాలు

## రేషన్ బియ్యం.. పక్కదారి!



**పలాస, జనవరి 17 (వార్త):** పేదలకు అందాల్సిన ప్రభుత్వ రేషన్ బియ్యం లారీల ద్వారా అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిపోతోంది. పలు రేషన్ దుకాణాలు, కార్డుదారుల నుంచి తక్కువ ధరకు సేకరించిన బియ్యాన్ని కొందరు దళారులు మిల్లులకు తరలిస్తూ క్యాష్ చేసుకుంటున్నారు. అర్ధరాత్రి వేళల్లో లారీల ద్వారా రేషన్ బియ్యం తరలింపులు జరుగుతున్నా సంబంధిత పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ, పోలీస్ అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అక్రమ రవాణాతో ప్రభుత్వానికి భారీ నష్టం వాటిల్లుతోంది. కొందరు మిల్లర్లు గ్రామాల్లో దళారులను ఏర్పాటు చేసుకుని పేదలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న బియ్యాన్ని కిలో రూ.15 నుంచి రూ.20లకు కొనుగోలు చేస్తున్నారు. అవి మిల్లులకు వచ్చిన తర్వాత ఆ బియ్యాన్ని మరోసారి పాలిష్ కొట్టి అందమైన సంచుల్లో నింపి కిలో రూ.50 నుంచి రూ.70లకు విక్రయిస్తూ సొమ్ములు చేసుకుంటున్నారు. రేషన్ బియ్యం తరలింపులో కొందరు అధికార పక్షం నేతల హస్తం ఉందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీకి చెందిన వారి మిల్లులకే ఈ బియ్యం తరలిపోతోంది. దీంతో సంబంధిత అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రేషన్ బియ్యం అక్రమంగా తరలిపోకుండా చూడాలని, మిల్లుల్లో దాడులు చేయాలని పలువురు కోరుతున్నారు.






## 33మంది అల్లుళ్లు... 53రకాల వంటకాలు



* బహడపల్లిలో అల్లుళ్లకు పసందైన సంక్రాంతి విందు

**మందస, జనవరి 17(వార్త):** బహడపల్లి పేరు వింటేనే సంస్కృతి, సంప్రదాయాలు, కళలు గుర్తుకు వస్తాయి. ప్రజల్లో చైతన్యం వెల్లి విరుస్తుంది. ఊరంతా కలసి.. పండగలు, పబ్బాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా సంక్రాంతికి ఏ కొత్తగా చేయాలని ప్లాన్ చేశారు. అనుకున్నదే తడవుగా కార్యరూపం దాల్చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. గ్రామానికి వచ్చే అల్లుళ్లకు షడ్రుచుల భోజనాలను అందివ్వాలని ఆలోచన చేశారు. దీంతో బహడపల్లి గ్రామానికి పిలుపులతో వచ్చిన 33మంది అల్లుళ్లకు సహపంక్తి భోజనాలను ఏర్పాటు చేశారు. 53 రకాలైన వంటకాలతో భోజనాలు ఏర్పాటు చేసి, అందర్నీ సంతృప్తి పరిచారు. అల్లుళ్లతో పాటు ఊరి ఆడపడుచులకు కూడా సహపంక్తిలో అవకాశం కల్పించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా సరికొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. కొత్త కండువాలతో అరిసెలు, పొంగడాల వంటి పాత వంటకాలతో పాటు ఈనాటి ధమ్ బిరియాని వరకు అన్ని రకాల వంటలతో పాటు చివరిగా తాంబూళం కూడా అందించారు. బహడపల్లి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



డి.గొనపపుట్టుగలో
## క్షుద్ర పూజలు

* శ్మశానానికి కూతవేటు దూరంలో
* భయాందోళనకు గురైన గ్రామస్థులు

**కవిటి/సోంపేట, జనవరి 17 (వార్త):** కవిటి మండలం డి.గొనపపుట్టుగ గ్రామ సమీపంలో శనివారం క్షుద్ర పూజలు ప్రజలను భయాందోళనకు గురిచేశాయి. చెల్లమ్మచెరువు నుంచి నీలాపుపుట్టుగకు వెళ్లే రోడ్డుపై శ్మశానానికి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు రంగులతో వేసిన బొమ్మలు, కపాలం బొమ్మలతో పాటు గడ్డితో తయారుచేసిన బొమ్మలకు పూజలు చేశారు. శనివారం దీన్ని గమనించిన కొందరు గ్రామస్థులు సమాచారం అందజేశారు. దీన్ని చూసేందుకు ప్రజలు తరలివచ్చారు. ఈవిషయం సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ అయింది. కొందరు యువకులు ప్రజలను భయపెట్టేందుకు ఇలా చేసివుంటారని యువత అనుకుంటుండగా, ఆదివారం అమావాస్య దృష్ట్యా ఎవరైనా ముందస్తు పూజలు చేసి ఉంటారా అని గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## పోర్టు, రైల్వే, విమానాశ్రయం నిర్మాణం ద్వారా.. సిక్కోలు అభివృద్ధి

* మరిన్ని సర్వీసులు తీసుకువస్తాం.. కొత్త హాల్టులు కేటాయిస్తాం
* ఇతర ప్రాంతాల నుండి శ్రీకాకుళంకు వలస వచ్చే విధంగా అభివృద్ధి చేస్తాం
* కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
* జెండా ఊపి రైలును ప్రారంభించిన కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు

**జలుమూరు/ఇచ్ఛాపురం, జనవరి 17(వార్త):** కనెక్టివిటీను పెంచడం ద్వారానే శ్రీకాకుళం మరింతగా అభివృద్ధి చెందుతుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం శ్రీకాకుళం జిల్లాలోని తిలారు రైల్వే స్టేషన్లో బ్రహ్మపూర్ విశాఖ బ్రహ్మపూర్ (18525/18526) ఎక్స్‌ప్రెస్ నూతన హాల్టును మంత్రి అచ్చెన్నాయుడు, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, రైల్వే అధికారులతో కలసి రామ్మోహన్ నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో అతిథులతో కలసి రామ్మోహన్ నాయుడు పాల్గొని మాట్లాడారు. పోర్ట్, రైల్వే, విమానాశ్రయ నిర్మాణం ద్వారా సిక్కోలు మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఇతర ప్రాంతాల నుంచి శ్రీకాకుళంకు వలస బాట పెరుగుతుందని తెలిపారు. తిలారులో పరిసర ప్రాంత ప్రజలకు మరింత సౌకర్యవంతం అయ్యేలా మరో సర్వీసును ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. శ్రీకాకుళం జిల్లాలో రైల్వే అంటేనే మొదట గుర్తుకు వచ్చే పేరు కింజరాపు ఎర్రంనాయుడు అని అన్నారు. దూసి మొదలుకొని, ఇచ్ఛాపురం వరకూ ప్రతీ స్టేషన్‌లో ఆయన అభివృద్ధి మార్క్ స్పష్టంగా కనిపిస్తుందని, పట్టుబట్టి అభివృద్ధి చేశారని అన్నారు. అయన ఆశయ సాధనకు తాను కృషి చేస్తున్నానని స్పష్టం చేశారు. తిలారు రైల్వే స్టేషన్‌ను మరింత అందంగా తయారు చేస్తామని, అప్రోచ్ రోడ్, అదనపు షాపులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఉత్తరాంధ్రలోనే జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఏకైక రైల్వే స్టేషన్ హరిశ్చంద్రపురంను అభివృద్ధి చేస్తే.. పరిసర ప్రాంతాలన్నీ కూడా అభివృద్ధి చెందుతాయన్నారు. కొత్త హాల్టుల మంజూరు కోసం కూడా ప్రయత్నాలు ముమ్మరం చేసినట్టు గుర్తు చేశారు. అండర్ పాస్ ల సమస్య దేశ వ్యాప్తంగా ఒకే విధంగా ఉందని, రైల్వే మంత్రిత్వ శాఖ దృష్టిలో సమస్య ఉందని రామ్మోహన్ నాయుడు గుర్తు చేశారు. ఆశపడి వేసుకున్న అండర్ పాసులు.. వర్షాకాలంలో స్థానిక ప్రజలకు ఇబ్బందులను రెట్టింపు చేస్తున్న విషయాన్ని పదే పదే పార్లమెంట్ లో గుర్తు చేసినట్టు స్పష్ట చేశారు. త్వరలోనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. కోటబొమ్మాళి రైల్వే స్టేషన్ లో ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ ను కూడా హాల్టును మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. శ్రీకాకుళం అభివృద్ధికి తాను, బాబాయ్ అచ్చెన్నాయుడు కట్టుబడి ఉన్నామన్నారు. యువత అంటే.. ప్రధాని మోదీకి అమితమైన అభిమానం అని.. ఆ కారణం చేతనే కేంద్ర మంత్రిగా నాకు అవకాశం దక్కిందని గుర్తు చేశారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలో రైల్వే విషయంలో అభివృద్ధికి రామ్మోహన్ విశేష కృషి చేస్తున్నారన్నారు. భవిష్యత్ అవసరాలను తీర్చే దిశగా నూతన ప్రాజెక్టులను తీసుకురావాలని కోరారు. రైల్వేలు ఎంతగా అభివృద్ధి చెందుతున్న అండర్ పాసేజ్‌ల విషయంలో స్థానిక ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, వర్షాలు వస్తున్న సమయంలో ఈ ఇబ్బందులు రెట్టింపు స్థాయిలో ఉంటున్నాయని అన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా రైల్వే అధికారులు చొరవ చూపాలని కోరారు.



### పూరి అహ్మదాబాద్ ట్రైన్‌కి ఇచ్ఛాపురంలో ఘన స్వాగతం



ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌లో పూరి నుండి అహ్మదాబాద్ వెళ్లే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌కి ఘన స్వాగతం లభించింది. ఇచ్ఛాపురం లో హాల్ట్ సౌకర్యం కల్పించడంతో తొలిసారిగా వస్తున్న ట్రైన్‌కి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ జెండా ఊపి ప్రారంభించారు. ట్రైన్ లోకో పైలట్ లకు సిబ్బందికి పులగుచ్ఛాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ కొండ శంకర్ రెడ్డి, జెడ్ అర్ యు సి సి సభ్యులు శ్రీనివాస్ రౌలో, తెలుగుదేశం పట్టణ మండలం అధ్యక్షులు పత్రి తవిటయ్య, లోపింటి పద్మనాభం, ఢిల్లీ రావు, కామేశ్వరరావు, లీలా రాణి, మణి ప్రకాష్, కోటి, కృష్ణారావు, సుభాస్ రౌలో, జయ దేవ్, వి కె ప్రసాద్, మంగి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. ఉదయం పూరి వైపు వెళ్లే ట్రైన్‌కి డిఆర్‌యుసిసి సభ్యులు కట్టా సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు.

## తలసేమియా చిన్నారికి శ్యాంప్రసాద్ రెడ్డి వితరణ

**ఇచ్ఛాపురం, జనవరి 17(వార్త):** కవిటి మండలం, వరక గ్రామానికి చెందిన పురియా శ్రీను, రాణి దంపతుల కుమారుడు పురియా ప్రవీణ్ కుమార్ (8) పుట్టుకతోనే తలసేమియా వ్యాధితో బాధపడుతూ ప్రతీ 25 రోజులకు ఒకసారి రక్త మార్పిడి చేసుకుంటున్నారు. హైదరాబాద్‌లో దినసరి కూలీగా జీవనం సాగిస్తున్న పురియా శ్రీనుకి తన కుమారునికి ప్రతి 25 రోజులకు ఒకసారి రక్త మార్పిడి దైనందిన వైద్య ఖర్చులు అతి కష్టంగా ఉంది. దీంతో తలసేమియా వ్యాధిగ్రస్తులకు ఏపీలో పెన్షన్ సదుపాయం ఉన్నందున కుటుంబాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి, రెండేళ్లుగా ప్రయత్నిస్తున్నప్పటికీ పెన్షన్ మంజూరు కాలేదు. ఈ విషయాన్ని వైస్సార్సీపీ సమన్వయకర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి ని కలసి వివరించారు. దీంతో ఆయనబీప తనవంతు ప్రయత్నిస్తానని, పెన్షన్ వచ్చేంతవరకు నెలకు రూ.2500లు ఇస్తానని హామీ ఇచ్చి, ఆ మొత్తాన్ని అందజేసారు. కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ బీసీ విభాగం కార్యదర్శి నర్తు నరేంద్రయాదవ్, నియోజవర్గ యువజన అధ్యక్షుడు నర్తు ప్రేమ్‌కుమార్ యాదవ్, శ్రీరామ్ రెడ్డి, భాను, కామేష్, నీలయ్య, పురియా శ్రీను, కాళి తదితరులు పాల్గొన్నారు.



# క్రీడాస్ఫూర్తికి టోర్నమెంట్లు దోహదం

**-ఎమ్మెల్యే కూన రవికుమార్**

**-యరగాంలో ఘనంగా ముగిసిన వాలీబాల్ పోటీలు**

**సరుబుజ్జిలి, జనవరి 17(వార్త):** సంక్రాంతి సందర్భంగా యరగాంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. సుబ్బపేట జట్టు విజేతగా నిలవగా, సవలాపురం గ్రామ జట్టు రన్నరప్‌గా నిలిచింది. విజేతలకు ఎమ్మెల్యే కూన రవికుమార్ బహుమతులందజేశారు. ముగ్గుల పోటీల విజేతలకు ఆయన బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో ఇలాంటి టోర్నమెంట్లు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ, ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ శివాల సూర్యనారాయణ, జిల్లా పార్లమెంటరీ అధికార ప్రతినిధి నందివాడ గోవిందరావు, మండల ప్రధాన కార్యదర్శి గురువు తిరు మలరావు, పల్లి సురేష్, కిల్లి సిద్ధార్థ, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, క్రీడాకారులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







## వైభవంగా దుర్గాదేవి యాత్ర

**జి.సిగడాం, జనవరి17(వార్త):** మధుపంకిలోని దుర్గమ్మ తల్లి 18వ యాత్ర మహోత్సవాలు అంగరంగ వైభవంగా శనివారం జరిగాయి. ఆదివారం యాత్ర ముగుస్తుందని, భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలి పారు. ఎస్ఐ వై.మధుసూదనరావు భారీ బందోబస్తు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ప్రత్యేక వసతులు ఏర్పాటు చేశారు. అమ్మవారికి ముడుపులు, మొక్కులు చెల్లించుకున్నారు.

## లయన్స్ క్లబ్ కోస్టల్ దాతృత్వం



**మందస, జనవరి 17(వార్త):** లయన్స్ క్లబ్ కోస్టల్(హరిపురం) తరచూ సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తోంది. అందరి మన్ననలు పొందుతోంది. చీపి పంచాయతీలో గల ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని గిరిజన గ్రామమైన దాలసరి గ్రామ గిరిజనులకు రగ్గులు శనివారం అందజేశారు. చలికాలం కావడంతో గిరిజనులకు చలి నుంచి రక్షణకు ఈ రగ్గులు పంపిణీ చేసినట్టు లయన్స్ క్లబ్ కోస్టల్(హరిపురం) ప్రతినిధులు చెప్పారు. సుమారు 50 మందికి రగ్గులు పంపణి చేసి, తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కోస్టల్(హరిపురం) అధ్యక్షుడు మార్పు వెంకటేశం, వైఎస్ఎన్ మూర్తి, మండెల్లి లక్ష్మణరావు, బైరిశెట్టి గున్నయ్య, జన్ని రాము, పాపారావు, పుల్లా వాసుదేవు తదితరులు పాల్గొన్నారు.

## నేడు మందసలో ఎన్టీఆర్ 30వ వర్ధంతి

**మందస, జనవరి 17(వార్త):** మాజీ ముఖ్య మంత్రి నందమూరి తారకరామారావు 30వ వర్ధంతి ఆదివారం నిర్వహిస్తున్నట్టు తెలుగు దేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బావన దుర్యో ధన తెలిపారు. ఉదయం 9 గంటలకు హరి పురం-బాలిగాం జంక్షన్‌లో, 10గంటలకు మందస టౌన్‌లో ఆ మహనీయునికి ఘనంగా నివాళులర్పిద్దామన్నారు. కార్యక్రమానికి కూటమి నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు.



## క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి



**మెళియాపుట్టి, జనవరి 17(వార్త):** యువత క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగా లని బాణాపురం సర్పంచ్ పెద్దింటి చంద్రరావు అన్నారు. ఆ పంచాయతీ పరిధిలో సంక్రాంతి సందర్భంగా ప్రీమియర్ క్రికెట్ మెగా టోర్నమెంట్ నిర్వ హించారు. ఎగువ బగడ (టైగర్ వారియర్స్) టీం విజేతగా, పదనాపురం (రెబల్ వారియర్స్) టీం రన్నర్‌గా నిలిచాయి. విజేతకు ఆరు వేల రూపాయలు, ట్రోఫీ, రన్నర్ టీంకు నాలుగు వేల రూపాయలతో పాటు ట్రోఫీలను అందించా మని చంద్రరావు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ పెద్దలు, రవికుమార్, సీది నారాయణ, జమానా లోకేశ్వరరావు, జన్ని కృష్ణారావు, పూర్ణచంద్రరావు, జనార్దన, వివిధ గ్రామాల యువత తదితరులు పాల్గొన్నారు.



# అంగరంగ వైభవంగా..
# రట్టి వల్లభనారాయణుడి తిరు వీధి

**-మేళతాళాలతో 12 గ్రామాల మీదుగా స్వామివారి ఊరేగింపు -భక్తి, శ్రద్ధలతో పూజలు**



**మందస, జనవరి 17(వార్త):** ఉద్దాన ప్రాంత ఆరాధ్యదైవం శ్రీరట్టి వల్లభ నారాయణుని తిరువీధి ఉత్సవం ఘనంగా జరిగింది. మందస రాజుల కాలం నుంచి ఆనవాయితీగా వస్తున్న సంప్రదాయం ప్రకారం వల్లభ నారాయణునికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రట్టి నుంచి నడక దారిలో సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న మందస పట్టణానికి అంబు గాం-బొడ్లూరు, హరిపురం, బాలిగాం, డబారు, ఉమాగిరి మీదుగా స్వామి వారిని తీసుకువచ్చారు. అప్పట్లో మందస రాజులకు సంతానం లేకపోవడంతో వల్లభనారాయ ణుని సముద్రతీరం ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి ప్రతిష్ఠించడంతో వారికి సంతాన కలిగిందట. అప్పటి నుంచి ఏటా సంక్రాంతి రోజున స్వామిని మేళ, తాళాలతో ఊరేగింపుగా మందస రాజావారి కోటకు తీసుకువస్తారు. వెండిగొడుగు, పాలకర్రలతో చేసిన స్వామి ఉత్సవ విగ్రహాలను మందస సంస్థాన రాజవంశీయులు ఆచార, వ్యవహా రాలతో పూజలు జరుపుతారు. అనంతరం మందసలో వల్లభ నారాయ ణునికి తిరువీధి నిర్వహించి, రట్టి గ్రామానికి తీసుకెళ్తారు. స్వామివారికి దారి పొడవునా భక్తులు అమృత భాండాలు, పూర్ణకుంభాలతో, పువ్వులు, కుంకుమలతో ఆహ్వానించి, ప్రత్యేక పూజలు జరిపారు. మహిళలు తమ చీర కొంగుల మీదుగా స్వామివారు నడిస్తే శుభాలు కలుగుతాయని నమ్ముతారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటం ప్రదర్శించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామి తిరువీధి మహోత్సవంలో పాల్గొని, దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు రట్టి సీతారాం, ప్రహ్లాద, వల్లభరావు, చంద్రయ్య, నీలకంఠం, వైకుంటరావు, ఢిల్లీరావు, హేమరాజు, పులారి కూర్మా రావు, పులారి సత్యనారాయణ, పులారి కృష్ణారావు, వీరయ్య, దాసరి తాతయ్య, మోహనరావు, సోమిశేఖర్, తలగాన కోదండరావు తదితరులు పాల్గొన్నారు.




# ‘భాస్కరరావు’ సేవలు చిరస్మరణీయం

**-మదర్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు**

**మల్లారెడ్డికి ఘన సన్మానం**

**మందస, జనవరి 17(వార్త):** మదర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్య క్షునిగా మల్లారెడ్డి భాస్కరరావు చేస్తున్న సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. సొండిపూడిలో శ్రీ వెంకటేశ్వర ఆలయం వద్ద భాస్కరరావు, జ్యోతి దంపతులను శనివారం ఘనంగా సన్మానించారు. గ్రామ సర్పంచ్ చిచ్చుల నళిని, గ్రామ పెద్దలు, శ్రీనివాసరావు దివ్యాంగులకు ట్రస్ట్ అందిస్తున్న సేవను ప్రశంసించారు. ట్రస్ట్ సేవలు వెలకట్టలేనివని, ఇటువంటి సేవా భావం కలిగిన నాయకులు తమ గ్రామంలో ఉండడం అదృష్టంగా భావిస్తున్నామని కొనియాడారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ తన సేవలను గుర్తించి, సన్మానించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్ మరిన్ని సేవలందిస్తామన్నారు. ఎవరికైనా దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అవసరమైతే వారికి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. అవసరమైన దివ్యాంగులు 9989371952 నెంబర్‌ని సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో మందస మండల తెలుగు యువత అధ్యక్షుడు ఔగన ఈశ్వర రావు, లైసెట్టి నారాయణరావు, శంకర ప్రసాద్, చిచ్చుల భూపతిరావు, మల్లారెడ్డి జగన్, చిచ్చుల ఢిల్లీమోహన్, తారక్ మోహన్, పర్వతారకేశ్వరరావు, బాడ వల్లభరావు, మద్ది బాబు, ఐదు మోహనరావు, ఎలుమల లక్ష్మణరావు, గుమ్మడి తారకేశ్వరరావు, గ్రామ యువత, మహిళలు పాల్గొన్నారు.



## శ్రీముఖలింగేశ్వర ఆలయానికి భక్తుల తాకిడి




**జలుమూరు, జనవరి 17(వార్త):** శ్రీముఖలింగంలో కొలువై ఉన్న శ్రీముఖలింగేశ్వర స్వామి ఆలయానికి ముక్కనుమ సందర్భంగా భక్తుల తాకిడి భారీగా పెరిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా క్యూలైన్లు, భద్రత, తాగునీరు వంటి ఏర్పాట్లు చేపట్టినట్లు ఆలయ ఈవో కొండలరావు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ పరిసరాల్లో శాంతిభద్రతలు పటిష్టంగా ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ముక్కనుమ పర్వదినం సందర్భంగా ఆలయం భక్తిశ్రద్ధలతో సందడిగా మారింది.

## పల్లెల్లో సంక్రాంతి క్రీడలు



**జి.సిగడాం, జనవరి 17(వార్త):** పెంట గ్రామంలో సంకాంత్రి పండగను పురస్కరించుకుని సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు మూడు రోజులుగా ఆట,పాటలతో పాటు సాయినగర్ వాసులు పలు క్రీడలు నిర్వహిం చారు. ఈ క్రీడా పోటీల్లో అధిక సంఖ్యలో మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలకు గ్రామ పెద్దలు,యువత బహు మతులు అందజేశారు.

## ఉద్దానంలో ఆకట్టుకున్న రంగవల్లులు



**మందస, జనవరి 17(వార్త):** ఉద్దానంలో సంక్రాంతి సందడి కొనసాగుతోంది. యువతులు వేసిన రంగవల్లులు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. రాంపురంలో ఓ యువతి వేసిన సంక్రాంతి ముగ్గు అందరినీ మంత్రముగ్ధులను చేస్తోంది. మూడు రోజుల పాటు ఈ ముగ్గును చెరిగిపోకుండా ఉంచుతున్నారు. సంప్రదాయాలకు నిలయమైన ఉద్దానంలో సంక్రాంతి సంబరాలు కొనసాగుతునే ఉన్నాయి.

## క్యాట్‌లో సోంపేట యువకుడి సత్తా

**సోంపేట, జనవరి 17(వార్త):** ఎంబీఏ పరీక్షల్లో సోంపేట యువకుడు సనపల కృష్ణ నందన్ సత్తా చాటాడు. దివంగత మాజీ అడ్వకేట్ సనపల రామారావు కుమారుడైన కృష్ణ నందన్ క్యాట్ విభాగంలో 96.37%, స్నాప్ విభాగంలో 95.44%, ఎక్స్ ఏటీ విభాగంలో 97.41% సాధించి అత్యుత్తమ ప్రతిభ చాటాడు. ఆయనకు తల్లి కవిత, సోదరుడు డాక్టర్ కృష్ణకౌశిక్, పలువురు ఉపాధ్యాయులు, పట్టణ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## సెమీ ఫైనల్‌లో సోంపేట జట్టు విజయం

**సోంపేట, జనవరి 17(వార్త):** కంచిలి మండలం మకరాంపురం గ్రామంలో శ్రీ విశ్వశాంతి క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న మెగా క్రికెట్ టోర్నమెంట్లో శనివారం సోంపేట సురేష్ 11, ఇచ్ఛాపురం ఎఫ్‌సీసీ జట్ల మధ్య జరిగిన రెండవ సెమీఫైనల్ మ్యాచ్‌లో సోంపేట జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి, బ్యాటింగ్ ఎంచుకున్న సోంపేట జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 122 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఇచ్ఛాపురం ఎఫ్‌సీసీ జట్టు 13.2 ఓవర్లలో కేవలం 81 పరుగులకే ఆలౌట్ అయింది. ఆవిష్కర్ పట్నాయక్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యారు.



# పూండి రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయండి

### -ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేయాలి

### - రైల్వే డీఆర్‌ఎమ్‌కి టీడీపీ నేతల వినతిపత్రం



**పలాస, జనవరి 17 (వార్త):** పూండి రైల్వే స్టేషన్‌ను రైల్వే డీఆర్‌ఎమ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, వజ్రపుకొత్తూరు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కర్ని రమణ.. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో రైల్వే ప్రయాణికుల తరఫున ఆయనకు వినతిపత్రం అందజేశారు. వజ్రపుకొత్తూరు, నందిగాం, సంతబొమ్మాలి మూడు మండలాలకు చెందిన గ్రామాల ప్రజల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ ప్రాంతం జనసాంద్రత అధికంగా ఉన్న ఉద్దానం ప్రాంతం కావడంతో రైల్వే ప్రయాణికుల సంఖ్య కూడా గణనీయంగా ఉందని, పూండి రైల్వే స్టేషన్ నుంచి ప్రతినెలా డీఎంయూ, ఈఎంయూ ప్యాసింజర్ రైళ్లు, పూరీ-తిరుపతి ఎక్స్‌ప్రెస్ ద్వారా సుమారు రూ.7 లక్షల ఆదా యం రైల్వే శాఖకు లభిస్తోందని డీఆర్‌ఎం దృష్టికి తీసుకువచ్చారు. ఈ స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు నిలుపుదల కల్పిస్తే ఆదాయం రూ.10 లక్షలకు పైగా చేరే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఎక్కేందుకుపై మూడు మండలాల ప్రజలు పలాస లేదా నౌపడ వరకు వెళ్లాల్సి వస్తుండటంతో వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు, పిల్లలు, వలస కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వికేంద్రీకృత ఆర్థిక వ్యవస్థ దృష్ట్యా పూండి వంటి పట్టణాన్ని అభివృద్ధి చేయడం అత్యవసరమని, ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల దీనికి కీలకమని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంతం నుంచి వేలాది మంది రక్షణ దళాల సిబ్బంది, విదేశాల్లో పనిచేసే కార్మికులు ప్రయాణిస్తున్నారని, భావనపాడు (మూలపేట) పోర్ట్ కు పూండి రైల్వే స్టేషన్ సమీపంలో ఉండటం కూడా ప్రత్యేక ప్రాధాన్యత కలిగిన అంశమని పేర్కొన్నారు. వివిధ డిమాండ్లను వినతి పత్రంలో పేర్కొన్నారు. పూండి రైల్వే స్టేషన్‌లో విశాఖ, ప్రశాంతి, పూరీ-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలని కోరారు.

ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు నిరంతర నీటి సరఫరాతో తాగునీటి సదుపాయం కల్పించాలని, ప్రధానమంత్రి స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి అనుగుణంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, స్టేషన్ రెండు వైపులా తగిన పొడవుతో, కూర్చునే సౌకర్యాలతో కూడిన వెయిటింగ్ షెడ్లు నిర్మించాలని, ప్రయాణికుల సౌకర్యార్థం పూండి స్టేషన్‌లో ప్యాసింజర్ రిజర్వేషన్ సిస్టమ్ (పీఆర్‌ఎస్) ఏర్పాటు చేయాలని, ఇటీవల నిర్మించిన అండర్‌పాత్‌కు ఇంకా పైకప్పు, లైట్స్ లేకపోవడంతో, ప్రజల భద్రత కోసం అండర్‌పాత్ పైకప్పు, లైట్స్ నిర్మాణం తక్షణమే చేపట్టాలని విన్నవించారు. దీనిపై అన్ని అంశాలను సానుకూలంగా పరిశీలించి పూండి రైల్వే స్టేషన్ అభివృద్ధికి, ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలకి అవసరమైన సహకారం అందించాలని రైల్వే డీఆర్‌ఎమ్‌ని ప్రయాణికులు ఏకగ్రీవంగా కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కొంచాడ వెంకటరావు, వార్డ్ మెంబర్ గణేష్, కోఆప్షన్ సభ్యులు శంకర్, ఎస్‌ఎంసీ చైర్మన్ శ్రీను, టీడీపీ సీనియర్ నాయకులు మోహనరావు, చంద్రయ్య, తుంభనాథం, కృష్ణార్జున యువ సైన్యం సభ్యులు నరేష్, సారధి, సోమేష్, నిహాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఊరు కదిలింది..రోడ్డు బాగు పడింది..!

### -స్వచ్ఛందంగా రోడ్డు వెడల్పు పనులు

### చేపట్టిన శ్రీముఖలింగం పొందర వీధి వాసులు

**జలుమూరు, జనవరి 17(వార్త):** శ్రీముఖలింగంలోని పొందర వీధిలో రోడ్డు వెడల్పు పనులను కాలనీ ప్రజలే స్వచ్ఛందంగా చేపట్టారు. ప్రభుత్వ సహాయం లేకుండానే, పరస్పర సమ్మతితో గ్రామాభివృద్ధి దిశగా ఈ పనులు ప్రారంభించడం ప్రత్యేకతగా నిలిచింది. ఈ కాలనీలో రోడ్డు ఇరుకుగా ఉండటంతో్ల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో, కాలనీ వాసులంతా సమావేశమై చర్చించి రోడ్డు వెడల్పు చేయాలని నిర్ణయించారు. ఇందుకు ప్రతి కుటుంబం సహకారం అందిస్తూ, తమ శక్తి మేరకు వనరులు సమకూర్చుకుంటూ పనులను ముందుకు తీసుకెళ్తున్నారు. ఈ రోడ్డు పనులు పూర్తయితే కాలనీలో నివసించే ప్రజలకు మాత్రమే కాకుండా, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, ఫైర్ వాహనాలు సులభంగా చేరుకునే అవకాశం ఉంటుందని కాలనీ పెద్దలు తెలిపారు. ప్రభుత్వంపై ఆధారపడకుండా, ప్రజలే అభివృద్ధి బాధ్యత తీసుకోవడం ఆదర్శంగా నిలుస్తుందని వారు అభిప్రాయపడ్డారు. స్వచ్ఛందంగా చేపట్టిన ఈ రోడ్డు వెడల్పు పనులు ప్రజాస్వామ్య చైతన్యానికి, సామూహిక బాధ్యతకు నిదర్శనంగా మారాయని స్థానికులు పేర్కొన్నారు. ప్రస్తుతం రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న వాటిని తీసివేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులు జోక్యం చేసుకోని డ్రైనేజీ, రోడ్డు నిర్మాణం చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఈ సమస్యపై కలెక్టర్, ఎమ్మెల్యే, మంత్రి, ఎంపీకి వినతిపత్రం ఇస్తామని కాలనీ వాసులు తెలిపారు.



# దళిత యువకుడి హత్యపై వైసీపీ నిరసన

**శ్రీకాకుళం, జనవరి 17(వార్త):** పల్నాడు జిల్లా పిన్నెల్లిలో దళిత యువకుడు మండా సాల్మన్‌ను పాశవికంగా హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో శనివారం శ్రీకాకుళంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద నిరసన తెలిపారు. ఈ ధర్నాకు పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ నాయ కత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ పాలనలో దళితుల భద్రత క్షీణించిందని, రాష్ట్రంలో శాంతిభద్ర తలు పూర్తిగా కుంటుపడ్డాయని విమర్శించారు. మండా సాల్మన్ హత్య అత్యంత అమానుషమైన చర్యగా పేర్కొన్న ఆయన, బాధిత కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దళితులపై జరుగుతున్న దాడులపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని ఆరోపించిన ధర్మాన కృష్ణదాస్, వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ అన్యాయాలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో ధర్మాన రామ్ మనోహర్ నాయుడు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ముంజేటి కృష్ణమూర్తి, అందవరపు సూరిబాబు, గేదెల పురుషోత్తం పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. దళితుల హక్కులను కాలరాస్తూ పాలన సాగుతోందని, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వారు ఆరోపించారు.



### బ్రాహ్మణతర్ల విద్యార్థుల

# అపూర్వ కలయిక

**పలాస, జనవరి 17 (వార్త):** బ్రాహ్మణతర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005-2006 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు 20 ఏళ్ల అనంతరం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం శనివారం పాఠశాల ఆవరణలో జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 90 మంది పూర్వ విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొని తమ పాఠశాల రోజుల మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆనాటి గురువులు కార్యక్రమానికి హాజరై, తమ శిష్యులను చూసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. విద్యార్థుల జీవితాల్లో దిశానిర్దేశం చేసిన గురువుల బోధనలకు పూర్వ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు చూపిన చొరవ తమకు ఉపాధి, జీవన మార్గాన్ని చూపిందని పలువురు పేర్కొన్నారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో గురువుల పాత్ర అనిర్వచనీయమన్నారు. స్నేహభావం, అనుబంధం, కృతజ్ఞతలతో నిండిన ఈ సమ్మేళనం పూర్వ విద్యార్థులందరికీ మరపురాని అనుభూతిని మిగిల్చిందని విద్యార్థులు తెలిపారు. అనంతరం పలువురు పూర్వ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తారకేశ్వరపండా, ఎస్‌ఎంసీ చైర్మన్ రఘుపాత్రుని బాలశంకర్, నాగేశ్వరరావు, రమణారావు, ఎస్.వి రమణారావు, బాలక్ శంకరరావు, మధుబాబు, తేజ, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





## పారిశుధ్య మెరుగుదలకు ట్రాక్టర్ తొట్టెల మంజూరు

**నరసన్నపేట, జనవరి 17 (వార్త):** గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను మరింత పటిష్టం చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు నరసన్నపేట ఎంపీడీవో కె.వి.ప్రసాదరావు తెలిపారు. శని వారం నరసన్నపేట ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లా డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలానికి ప్రభు త్వం ఇటీవల రెండు ట్రాక్టర్ తొట్టె లను మంజూరు చేసినట్లు తెలి పారు. మరో ఐదు ట్రాక్టర్ తొట్టెల మంజూరుకు అనుమతులు కూడా జారీ అవుతున్నాయని చెప్పారు. గ్రామాల్లో చెత్త సేకరణ, రవాణా, పారిశుధ్య నిర్వహణ మరింత సమర్థవంతంగా జరిగేందుకు ఈ వాహనాలు ఉపయోగపడతాయన్నారు. మంజూరైన ట్రాక్టర్ తొట్టెలను మేజర్ పంచాయతీలకు అప్పగిస్తామని ఎంపీడీవో స్పష్టం చేశారు. గ్రామాల్లో పరిశుభ్రతను కాపాడేందుకు స్థానిక సంస్థలు, ప్రజల సహకారం అవసరమని ఆయన సూచించారు.

### తిమడాం జడ్పీ హైస్కూల్‌లో ..

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం





**జలుమూరు, జనవరి 17 (వార్త):** తిమడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక సమావేశం ఘనంగా జరిగింది. 2009-10 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఈ సమావేశంలో పాల్గొని, పాఠశాల రోజుల జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించి ఆశీర్వాదాలు పొందారు. ఉపాధ్యాయులు వెలమల మనహర్, వెలమల సూర్యనారాయణ, వెలమల నాగమణి ఈ కార్యక్రమంలో పాల్గొని పూర్వ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల విద్యార్థి దశలో ఏర్పడిన స్నేహబంధాలు, గురు-శిష్య సంబంధాల విలువను ఈ సమ్మేళనం మరింత గుర్తు చేసిందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగింది.

## లక్ష్మీనర్సుపేట పూర్వ విద్యార్థుల..

**ఎల్‌ఎన్ పేట, జనవరి 17(వార్త):** లక్ష్మీనర్సుపేట ఉన్నత పాఠశాలలో 1999-2000, 2000-21లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు శనివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామ దేవత శ్రీ బంగారమ్మ తల్లిని దర్శించుకొని స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆనాటి ఉపాధ్యాయులు ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల కలయికతో ఆనాటి చదువుకునే సమయంలో వారి జ్ఞాపకాలను ఒకరినొకరు గుర్తు చేసుకుంటూ ఒక పండుగ వాతావరణంలో గడిపారు. ప్రధానోపాధ్యాయులు బులుసు పేరుశాస్త్రి, ఉపాధ్యాయులు రామారావు, పైడి మల్లేశ్వరరావు, జి.కామేశ్వరరావు, రామచంద్రుడు, ఆనందరావు, జి.కామేశ్వం రావు, రామచంద్రరావు, లయన్ ఎం.కె.మిశ్రో, శరత్ చంద్ర పాణిగ్రాహి, ఎన్.వెంకటేష్, నాగేశ్వర ప్రసాద్ సాహు, సుభాష్ చంద్ర పండా, ఎ.నారాయణరావు, రవికుమార్ మహంతి, బ్రజ్ కుమార్ పాణిగ్రాహి, నక్క కృష్ణారావు, ఉపాధ్యాయేతర సిబ్బంది వేణు పండా, శిరీషను ఘనంగా సన్మానించారు. గ్రామ పెద్దలు, పూర్వవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక



## శ్రీకాకుళం

## క్రైం వార్తలు

### పంచాయతీ కార్యదర్శి ఇంట్లో చోరీ

**పలాస/వజ్రపుకొత్తూరు, జనవరి 17(వార్త):** వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం పంచాయతీ కార్యదర్శి శరత్‌చంద్ర ఇంట్లో దొంగతనం జరిగింది. బాధితుడు తెలిపిన సమాచారం మేరకు నందిగాం మండలం బోరుభద్రకు చెందిన శరత్‌చంద్ర గోవిందపురంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ పూండి- గోవిందపురం సాయిరాం కాలనీలో కుటుం బంతో నివాసం ఉంటున్నాడు. సంక్రాంతి సెలవులు కావడంతో ఈనెల 13న ఇంటికి తాళం వేసి స్వగ్రామానికి కుటుంబంతో కలసి వెళ్లారు. తిరిగి శనివారం గోవిందపురం సచివాలయంలో విధులకు హాజరయ్యారు. సాయంత్రం ఇంటికి రాగా తలుపులు తీసి ఉండడాన్ని గమనించారు. బీరువాలో ఉన్న 75 తులాలు వెండి, ఐదున్నర తులాల బంగారం వస్తువులతో పాటు రూ.90 వేలు చోరీకి గురైనట్టు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బి.నిహార్ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**శ్రీకాకుళం క్రైం, జనవరి 17 (వార్త):** రణస్థలం జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం తమ్మాపురానికి చెందిన దువ్వ కోటేశ్వరరావు (26) మృతి చెందాడు. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కోటేశ్వరరావు తల్లి, సోదరుడితో వల్లభరావుపేటకు శుక్రవారం వచ్చాడు. తల్లికి వైద్య పరీక్షలు చేయించేందుకు శనివారం మండల కేంద్రంలో ని ఒక ప్రైవేటు ఆసుపత్రికి ద్విచక్రవాహనంపై తీసుకొచ్చాడు. తిరిగి వల్లభరావు పేట వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న లారీ ఢీ కొంది. దీంతో కోటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### భేతాళపురం యువకుడు ఆకస్మిక మృతి



**మందస, జనవరి 17(వార్త):** ఉన్న చోట ఉపాధి లేక.. వేరే ప్రాంతానికి వెళ్లి కుటుంబాన్ని పోషిద్దామనుకున్న ఆ యువకుని ఆశలు ఫలించలేదు.. కష్టపడి జీవనం సాగిస్తున్న ఆ కుటుంబానికి పెద్ద దిక్కు లేకుండా విధి చేసింది.. దీంతో కన్నీరు, మున్నీరుగా ఆ కుటుంబీకులు విలపిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి. మందస మండలంలోని భేతాళపురం గ్రామానికి చెందిన సోడిపల్లి రాజేశ్ (33) అనే యువకుడు స్థానికంగా ఉపాధి లేకపోవడంతో బెంగుళూరు వెళ్లి.. కాయకష్టం చేసుకుంటూ, కుటుంబాన్ని పోషిస్తున్నాడు. విధికి కన్నుకుట్టింది. దీంతో హటాత్తుగా రాజేష్ తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. బెంగుళూరు నుంచి తీసుకువచ్చి, శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సకై చేర్పించారు. 10రోజుల పాటు మృత్యువుతో పోరాడగా.. మృత్యువుదే పైచేయి అయ్యింది. నిరుపేద కుటుంబం కావడంతో చికిత్సకై ఆయన స్నేహితులు, బంధువులు, గ్రామస్తులు సాయం చేశారు. కానీ.. రాజేష్ చికిత్స పొందుతూ మరణించాడు. మృతునికి భార్య రాధిక, కుమార్తె దీక్షిత ఉన్నారు. రాజేష్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

### గుండ అప్పల సూర్యనారాయణ సేవలు మరువలేనివి

* రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్
* అప్పల సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి



**శ్రీకాకుళం, జనవరి 17(వార్త):** శ్రీకాకుళం నియోజకవర్గానికి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా, సీనియర్ నేతగా పార్టీకి, ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలకు గుండ అప్పల సూర్య నారాయణ చేసిన సేవలు అమూల్యమైనవని రాష్ట్ర సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శ్రీకాకుళంలోని గుండ అప్పల సూర్యనారాయణ నివాసానికి వెళ్లిన మంత్రి శ్రీనివాస్ వెళ్లారు. అప్పలసూర్యనారాయణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి అప్పల సూర్యనారాయణ మరణం పట్ల ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ కష్టసమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని, గుండె నిబ్బరాన్ని ప్రసాదించాలని భగవంతుడిని కోరుకుంటున్నానని అన్నారు. శ్రీకాకుళం జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్ర వేసి, నిరంతరం ప్రజల కోసం శ్రమించిన ఒక గొప్ప నాయకుడు గుండ అప్పల సూర్యనారాయణను కోల్పోవటం తీరని లోటని అన్నారు. ఆయన చేసిన సేవలను ఈరోజు ప్రాంత ప్రజలు ఎప్పటికి మర్చిపోరని తెలిపారు. ఈయన కుటుంబానికి తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి భరోసానిచ్చారు.

### శ్రీముఖలింగంలో భక్తుల రద్దీ

**జలుమూరు, జనవరి 17 (వార్త):** పండగను పురస్కరించుకుని ముక్కనుము రోజున భక్తులు శ్రీముఖలింగం ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. క్యూలైన్లు కిటకిటలాడాయి. భక్తులు గర్భగుడిలోకి వెళ్లేందుకు అధిక సంఖ్యలో పోటీపడ్డారు. ఆలయాధికారులు, పోలీసులు ఆలయం వద్ద భక్తులు తోపులాటకు గురికాకుండా అన్ని చర్యలు చేపట్టారు. క్యూలైన్లలో ఉండి భక్తులు స్వామి వారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేశారు. అలాగే ఆమదాలవలస మండలం గాజులకొల్లివలసలో సంగమేశ్వరస్వామి జాతర చివరి రోజు కావడంతో తెలుగు రాష్ట్రాలు, ఒడిశా నుంచి భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సంగమేశ్వర స్వామి కొండ భక్తులతో కిటకిటలాడింది. ఈ మూడు రోజుల్లో సుమారు 2 లక్షల మంది పాల్గొన్నారని కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే నరసన్నపేట మండలం గొట్టిపల్లి సమీపంలో హాలాహలేశ్వరస్వామి దర్శనానికి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. కంబకాయలో స్వయంభేశ్వరస్వామి ఆలయం రద్దీగా మారింది.

#### పట్టణాలకు వలసబాట

సంక్రాంతి సంబరాలు శనివారంతో ముగియడంతో సొంత గ్రామాలకు వచ్చిన వారంతా తిరుగుముఖం పట్టారు.పల్లెల్లో చేసేందుకు పనులు లేకపోవడంతో మళ్లీ పట్టణప్రాంతాలకు భారంగా కదిలారు. దీంతో బస్ స్టేషన్లు, రైల్వేస్టేషన్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. శ్రీకాకుళం, నరసన్నపేట తదితర ప్రాంతాల్లో విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ వెళ్లే బస్సుల కోసం ఎగబడ్డారు. మరికొందరు ప్రైవేటు బస్సులు, వాహనాల్లో గమ్యస్థానాలకు పయనమయ్యారు.

## పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



**మందస, జనవరి 17(వార్త):** పాడి రైతులు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మందస మండల పశువైద్యాధికారి డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్ కోరారు. ఈ నెల 19నుంచి నుంచి 31వరకు ఈ శిబిరాలను నిర్వహిస్తామన్నారు. పశుసంవర్ధక శాఖ సిబ్బందితో రెండు బృందాలు ఏర్పాటు చేసి, వివిధ గ్రామాలో షెడ్యూల్ ప్రకారం ఈ శిబిరాలు కొనసాగుతాయన్నారు. ఆరోగ్య శిబిరాలలో పశువైద్య చికిత్సలు, గర్భకోశ వ్యాధులకు చికిత్స, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు పంపిణీ, పశు వ్యాధి నివారణ పరీక్షలతో పాటు పాడి రైతులకు శాస్త్రీయ యాజమాన్యం పై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

# పటిష్ట పోలీసు బందోబస్తుతో రథసప్తమి వేడుకలు

* గత ఏడాదికంటే మరింత సులభంగా సామాన్య భక్తులకు దర్శనం * విశాఖపట్నం రేంజ్ ఐజి గోపీనాథ్ జట్టి * జిల్లా పోలీసు అధికారులతో సమీక్ష

**శ్రీకాకుళం, జనవరి17(వార్త):** అరసవిల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో రాబోయే రథసప్తమి వేడుకలను ప్రశాంతంగా, సురక్షితంగా సక్రమంగా నిర్వహించేందుకు శ్రీకాకుళం జిల్లా పోలీసు శాఖ విస్తృత ఏర్పాట్లు చేపట్టిందని విశాఖపట్నం రేంజ్ ఐజి గోపీనాథ్ జట్టి తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం శ్రీకాకుళం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలతో రథసప్తమి బందోబస్తు ఏర్పాట్లపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో రథసప్తమి సందర్భంగా అమలు చేయనున్న రూట్ మ్యాప్‌లు, వాహనాల పార్కింగ్ ప్రదేశాలు, క్యూ లైన్ నిర్వహణ, బారికేడ్ల ఏర్పాటు, ఉచిత దర్శనం, డోనర్ దర్శనం (రూ.100, రూ.500), వీఐపీ దర్శన మార్గాలు, భక్తుల హోల్డింగ్ ఏరియాలు, ప్రసాదం కౌంటర్లు, పాదరక్షలు ఉంచే ప్రదేశాలు, భక్తుల రాకపోకల నియంత్రణ, ట్రాఫిక్ మళ్లింపులు తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా రేంజ్ ఐజి గోపీనాథ్ జట్టి మాట్లాడుతూ, పోలీసు అధికారులు, సిబ్బంది ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పకడ్బందీగా బందోబస్తు విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, భక్తుల భద్రతే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. ముఖ్యంగా ట్రాఫిక్ నియంత్రణ, జనసందోహ నియంత్రణ, అత్యవసర సేవల సమర్థ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది సామాన్య భక్తులు మరింత వేగంగా, సులభంగా దర్శనం చేసుకునే విధంగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని క్యూ లైన్‌లను శాస్త్రీయంగా నిర్వహించడం, స్పష్టమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం, వాలంటీర్ల సహకారంతో భక్తులకు మార్గనిర్దేశం చేయడం, నీడ, త్రాగునీరు, వైద్య సౌకర్యాలు వంటి సదుపాయాల సమన్వయంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. వీఐపీ దర్శనాల విషయంలో సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రవేశ మార్గం, నిష్క్రమణ మార్గాలను వేర్వేరుగా ఏర్పాటు చేసి, ఉత్తర (వైకుంఠ)ద్వారం ద్వారా ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఉచిత దర్శనం, డోనర్ దర్శనం (రూ.100, రూ.500) మరియు వీఐపీ దర్శన మార్గాలు ఎక్కడా మిశ్రమం కాకుండా అదనపు క్యూ లైన్‌లు ఏర్పాటు చేసి క్రమబద్ధంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, రథసప్తమి వేడుకలు శాంతియుతంగా, సురక్షితంగా జరగేందుకు జిల్లా పోలీసు శాఖ అన్ని శాఖలతో సమన్వయంతో పనిచేస్తోందని తెలిపారు. ఇప్పటికే ప్రత్యేక కార్యచరణ ప్రణాళికతో బందోబస్తు స్కీమ్ సిద్ధం చేసినట్లు, పోలీసు, రెవెన్యూ, ఆలయ అధికారులు, వైద్య శాఖ, మునిసిపల్ విభాగాలు సమన్వయంతో పనిచేస్తాయని చెప్పారు. భక్తులు పోలీసు సూచనలు పాటించి సహకరించాలని కోరారు. ఈ





సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీ శ్రీ కె.వి. రమణ, డీఎస్పీలు వివేకానంద, లక్ష్మణరావు, శేషాద్రి, సీఐలు మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

### ఆదిత్యుని సన్నిధిలో కలెక్టర్

**అరసవల్లి, జనవరి 17 (వార్త):** ప్రత్యక్షదైవం ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామిని శనివారం ఉదయం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ దంపతులు దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, ఆలయ కార్యనిర్వాహణాధికారి ప్రసాద్ స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనం అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు.

### నేటి నుంచి డోనర్ పాసుల పంపిణీ

రథసప్తమిని పురస్కరించుకుని డోనర్ పాసులను ఈనెల 18 నుంచి 23 వరకూ పంపిణీ చేయనున్నట్లు అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ప్రసాద్ తెలిపారు. దేవాలయానికి విరాళాలు సమర్పించిన దాతలు గమనించాలన్నారు. అలాగే వీఐపీ పాసుల దర్శనం టిక్కెట్లు రూ.300లు తీసుకోవల్సిన వారు ప్రజాప్రతినిధులు, అధికారుల సిఫార్సు లేఖలతో ఈనెల 19 నుంచి శ్రీకాకుళం ఆర్డీవో అమోదపు లేఖ పొంది బ్యాంకు ద్వారా పాసులు పొందవలసి ఉంటుందన్నారు. వీఐపీ పాసుల కోసం 9494233490,8333988769 నంబర్లను సంప్రదించాలన్నారు.

### అరసవల్లి శోభాయాత్ర 23కు మార్పు

అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థాన రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 19న జరగాల్సిన 'శోభాయాత్ర'ను 23వ తేదీకి మారుస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది ఈ వేడుకలను తొలిరోజే శోభాయాత్రతో అత్యంత వైభవంగా ప్రారంభించామని, అయితే మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ మృతితో జిల్లాలో సంతాప పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఈ సారి మార్పు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. 23వ తేదీ మధ్యాహ్నం నుంచి శోభాయాత్రను నిర్వహించనున్నట్లు కలెక్టర్ వివరించారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, స్థానిక శాసనసభ్యులు గొండు శంకర్‌లతో సంప్రదింపులు జరిపిన అనంతరం, అరసవల్లికి చెందిన దివంగత నేతకు గౌరవ నివాళిగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. వారం రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో తొలి మూడు రోజులు పాటు జరిగే కార్యక్రమాలను కూడా చాలా వరకు తగ్గించామని, అయితే భక్తుల దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు.



## శ్రీకాకుళం, ఆమదాలవలస రోడ్డు పనుల్లో పురోగతి

* శ్రీకాకుళం నగరం పాలకొండ రోడ్డు అభివృద్ధికి ఎనిమిది కోట్లు మంజూరు
* గత ప్రభుత్వంలో జరిగిన పనులకు కూడా 16 కోట్ల పాత బకాయిలు విడుదల
* కూటమి ప్రభుత్వం వచ్చాక మొత్తం 24 కోట్లు విడుదల
* త్వరలో పనులు ప్రారంభించాలని అధికారులకు ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదేశాలు

**శ్రీకాకుళం, జనవరి 17(వార్త):** శ్రీకాకుళం, ఆమదాలవలస రైల్వే స్టేషన్ రోడ్డు అభివృద్ధికి శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రథమ ప్రాధాన్యత కలిగిన పనిగా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, నిరంతరం అధికారులతో పర్యవేక్షిస్తూ, రోడ్ నివాసిత ప్రజలతో సమావేశాలు నిర్వహించి రోడ్డు విస్తరణకు ఒప్పించి, రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. గత ప్రభుత్వంలో పని చేసిన పనులకు సంబంధించిన 16 కోట్ల పెండింగ్ బిల్లులను కూడా కూటమి ప్రభుత్వం వచ్చాక విడుదల చేశామని, కల్వర్టుల నిర్మాణం, శ్రీకాకుళం నగరం పాలకొండ రోడ్డు విస్తరణ, అభివృద్ధి కొరకు రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిది కోట్లు మంజూరు చేస్తూ పరిపాలన అనుమతులు విడుదల చేసింది అని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. కూటమీ ప్రభుత్వం వచ్చాక మొత్తం 24 కోట్ల నిధులు విడుదల చేశామని. మిగిలిన పనులను కూడాత్వరలో శ్రీకాకుళం ఆమదాలవలస రోడ్డునును విస్తరించి, అభివృద్ధి చేసేందుకు పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు అభివృద్ధికి నిరంతరం పర్యవేక్షిస్తూ కృషి చేసిన శ్రీకాకుళం ఎమ్మెల్యే శంకర్ అధికారులను, ప్రభుత్వ పెద్దలను సమన్వయపరచుకొని అవసరమైన నిధులు రాబట్ట గలిగారు. నగర అభివృద్ధికి, రహదారుల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం చేసిన కృషిని, ప్రయాణికులు, వాహనచోదకులు, ప్రజలు హర్షిస్తున్నారు.

### 22 నుంచి శ్రీకాకుళం, విశాఖ జిల్లాల్లో అసెంబ్లీ పీయూసీ పర్యటన

**శ్రీకాకుళం, జనవరి 17 (వార్త):** ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ (పియుసి) ఈ నెల 22 నుంచి 25 వరకు ఉత్తరాంధ్రలో పర్యటించనుంది. ఈ నెల 22న అమరావతిలో సమావేశమై, రాత్రికి రైలు మార్గంలో శ్రీకాకుళం బయలుదేరుతారు. 23న శ్రీకాకుళం కలెక్టరేట్‌లో అంబేద్కర్, జేఎన్టీయూ, ఆర్జీయూకేటీ వర్సిటీలతో పాటు సుడా, స్మార్ట్ సిటీ కార్పొరేషన్ అధికారులతో కమిటీ సమీక్ష నిర్వహించనుంది. అనంతరం 24న విశాఖపట్నంలో పర్యటించి వీఎంఆర్‌డీఏ, గిరిజన సహకార సంస్థ (జీసీసీ), ఈపీడీసీఎల్, పోర్ట్ ట్రస్ట్ అధికారులతో క్షేత్రస్థాయిలో భేటీ కానున్నారు. ప్రభుత్వ సంస్థల పనితీరు, నిధుల వినియోగంపై ఈ పర్యటనలో కమిటీ సభ్యులు ప్రధానంగా సమీక్షించనున్నారు. పర్యటన ముగించుకుని 25న ఉదయం సభ్యులు తిరిగి విజయవాడ చేరుకుంటారు.

### జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో ఉద్యోగాల భర్తీ

**శ్రీకాకుళం, జనవరి 17(వార్త):** శ్రీకాకుళం జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో ఖాళీగా ఉన్న డేటా ఎంట్రీ ఆపరేటర్, ఫ్రంట్ ఆఫీస్ కో-ఆర్డినేటర్, రికార్డు అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. మొత్తం నాలుగు పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిలో భర్తీ చేయనుండగా, ఇందులో రికార్డు అసిస్టెంట్ విభాగంలో రెండు (ఓసి-1, ఎస్సీ-1), మిగిలిన రెండు విభాగాల్లో ఒక్కోటి చొప్పున (ఓసి) ఖాళీలు ఉన్నాయి. ఎంపికైన వారికి పోస్టును బట్టి నెలకు రూ.23,120 నుండి రూ.89,720 వరకు వేతన శ్రేణి వర్తిస్తుందని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు జిల్లా కోర్టు అధికారిక వెబ్‌సైట్ నుండి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని, పూర్తి చేసిన ఫారమ్‌లను ఈనెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తులను కేవలం రిజిస్టర్డ్ పోస్ట్ లేదా స్పీడ్ పోస్ట్ ద్వారా మాత్రమే 'చైర్మన్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, శ్రీకాకుళం' చిరునామాకు పంపాలని అధికారులు స్పష్టం చేశారు. విద్యార్హతలు, వయోపరిమితికి సంబంధించిన పూర్తి వివరాల కోసం అభ్యర్థులు జిల్లా కోర్టు వెబ్‌సైట్‌ను https://srikakulam.dcourts.gov.in సంప్రదించగలరు.

#### రికార్డు అసిస్టెంట్ పోస్టుల రోస్టర్ పాయింట్‌లో సవరణ

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ లో రికార్డు అసిస్టెంట్ పోస్టు భర్తీకి సంబంధించి గతంలో విడుదల చేసిన నోటిఫికేషన్‌లో స్వల్ప మార్పులు చేస్తూ సంస్థ ఛైర్మన్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 12న విడుదల చేసిన నోటిఫికేషన్ నెం. 01/2026 లోని రోస్టర్ పాయింట్లలోని రిజర్వేషన్ కేటగిరీని సవరించినట్లు పేర్కొన్నారు. రికార్డు అసిస్టెంట్ పోస్టుకు సంబంధించి రోస్టర్ పాయింట్ నెం. 2లో ఇదివరకు 'ఎస్సీ' కేటగిరీగా ఉన్న రిజర్వేషన్‌ను, తాజా సవరణ ప్రకారం 'ఎస్సీ - గ్రూప్ 1' గా పరిగణించనున్నట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు (జీవో ఎంఎస్ నెంబర్.46), రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ మార్పు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సమాచారాన్ని జిల్లాలోని అన్ని కోర్టుల నోటీసు బోర్డుల్లోనూ, ఉపాధి కార్యాలయాల్లోనూ ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు.

### జీలుగుకల్లు తాగి అస్వస్థతకు గురైన వారికి తక్షణమే చికిత్స

* కురుపాం సీహెచ్‌సీలో చికిత్స అందిస్తున్న వైద్యులు * ప్రస్తుతం అందరి ఆరోగ్యం నిలకడగా ఉంది * పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి

**పార్వతీపురం, జనవరి 17(వార్త):** కురుపాం మండలంలో జీలుగుకల్లు సేవించి అస్వస్థతకు గురైన పలువురిని తక్షణమే చికిత్స అందించినట్లు జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి పేర్కొన్నారు. జీలుగుకల్లు సేవించి తీవ్రమైన విరేచనాలతో బాధపడుతున్న నలుగురు వ్యక్తులను కురుపాం సి.హెచ్.సికి తరలించడం జరిగిందన్నారు. ఈ విషయమై జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి సత్వరం స్పందించి, సంబంధిత వైద్య ఆరోగ్య శాఖాధికారులకు పలు సూచనలు చేస్తూ మార్గదర్శకాలు జారీచేసినట్లు చెప్పారు. ప్రస్తుతం అందరి ఆరోగ్యం నిలకడగా ఉందని, ఎటువంటి ఆందోళన అవసరం లేదని చెప్పారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జె. నీలకంఠం (37), పువ్వల రాంసింగ్ (25), జె.జోగారావు (38), జె.భూషణ రావు (54)ల ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని, ఈ మేరకు వైద్యులు తెలిపారని అన్నారు. జె.జోగారావుకు రక్తపోటు (160/100) అధికంగా ఉండటంతో వైద్యులు ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై దుద్దుకల్లు పి.హెచ్.సి వైద్య బృందం తక్షణమే స్పందించిందని, బాధితులు నివసిస్తున్న వనకాబారి గ్రామంలో అత్యవసర మెడికల్ క్యాంప్ నిర్వహించినట్లు చెప్పారు. ఈ తనిఖీల్లో అదే మద్యం సేవించిన మరో నలుగురు వ్యక్తులను (జె. గౌరీశంకర్, జె. రమేష్, ఎం. లింగారావు, పి. రామమూర్తి) కూడా గుర్తించడం జరిగిందని వివరించారు. ?ప్రస్తుతానికి వీరిలో ఎటువంటి ప్రమాదకర లక్షణాలు లేనప్పటికీ, ముందు జాగ్రత్తగా వారికి అవసరమైన మందులు, ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లను అందజేసినట్లు తెలిపారు. గ్రామంలో పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తూ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ సూచించినట్లు ఆదేశాలు జారీచేశామని కలెక్టర్ తెలిపారు.





### హరిశ్చంద్రపురం స్టేషన్ అభివృద్ధికి చర్యలు చేపట్టండి

**జలుమూరు, జనవరి 17(వార్త):** టెక్కలి నియోజకవర్గ పరిధి, హరిశ్చంద్రపురం ఆర్ఎస్ అభివృద్ధికి దృష్టిసారించాలని కోరుతూ కేంద్ర పౌర విమానాయాన శాఖామాత్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు శనివారం తిలారు రైల్వే స్టేషన్లో బ్రహ్మపూర్ - విశాఖ సర్వీసుకు సంబంధించి నూతన హాల్ట్ ను కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హరిశ్చంద్రపురం ఆర్.ఎస్. ప్రయాణికుల విన్నపం మేరకు గుణుపూర్ ఎక్స్ ప్రెస్ (ఎక్స్ ప్రెస్ / పాసింజర్), భువనేశ్వర్ - విశాఖ పట్నం ఇంటర్ సిటీ, పూరీ - తిరుపతి ఎక్స్ ప్రెస్, విశాఖ ఎక్స్ ప్రెస్ సర్వీసులను హరిశ్చంద్రపురం స్టేషన్లో నిలుపుదల చేయాలన్నారు. మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం ఇచ్చారు. వీటిపై రైల్వే ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించారు. హరిశ్చంద్రపురం రైల్వే స్టేషన్ కు ఆనుకుని 40 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉందని, దీనిని ఆదాయం తీసుకుని వచ్చేందుకు వీలుగా రైల్వే గొడౌన్ నిర్మాణానికి కానీ, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ కు సంబంధించి క్వార్టర్స్ నిర్మాణానికి కానీ లేదా ఇతర అభివృద్ధి పనులు కానీ చేపట్టాలని ప్రయాణికుల తరపున మంత్రి అచ్చెన్న విన్నవించారు. తద్వారా స్టేషన్ సిబ్బందిని కానీ టికెట్ విక్రేతలను కానీ నియమించి స్థానికంగా ఇక్కడి నుంచే పనిచేసే వీలుంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజనల్ రైల్వే మేనేజర్ డీఆర్ఎం లలిత్ బోహ్రా పాల్గొన్నారు.

### రైతుల సమక్షంలోనే రీసర్వే

* పారదర్శకతకు పెద్దపీట
* సర్వే, ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ కూర్మనాథ్

**సంతబొమ్మాళి/పలాస, జనవరి 17(వార్త):** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకగా చేపట్టిన భూముల రీసర్వే ప్రక్రియలో ఎక్కడా చిన్నపాటి పొరపాట్లకు తావులేకుండా, పారదర్శకంగా నిర్వహించాలని సర్వే సెటిల్మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన శ్రీకాకుళం జిల్లాలో విస్తృతంగా పర్యటించి, రీసర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మొదట సంతబొమ్మాలి మండలంలోని పాలతలగం, బోరుభద్ర, మేఘవరం గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పొలాల్లోకి వెళ్లి నేరుగా రైతులతో మాట్లాడారు. రైతుల సమక్షంలోనే రోవర్‌ను ఉపయోగించి స్వయంగా కొలతలు వేయించి, వారి భూ విస్తీర్ణాలను రైతులకు వివరించారు. భూ యజమానులకు ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పలాస మండల తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన డైరెక్టర్, రీసర్వేకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. వెరిఫికేషన్, కరెక్టిఫికేషన్ ప్రక్రియ ఏ స్థాయిలో ఉందో అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా లాగిన్ వివరాలను తనిఖీ చేసి, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం తలంతరి గ్రామంలో గ్రౌండ్ పొజిషన్‌ను పరిశీలించి, అలైన్మెంట్ల ప్రకారం సర్వే పూర్తి చేయని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పర్యటనలో సర్వే భూమి రికార్డుల సహాయ సంచాలకులు ఏ.వెంకటేశ్వరరావు, టెక్కలి, పలాస డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు మామిడి జనార్ధనరావు, చంద్రశేఖర రావు, సంతబొమ్మాళి, పలాస తహశీల్దార్లు, ఇతర రెవెన్యూ సర్వే సిబ్బంది పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546